# నటకులూ, చిత్రాలూ

మొన్న మొన్నటిదాకా వేషాలువేసుకుని జీవించేవారిని సంఘం ఎంతలోకువగా చూస్తూవచ్చిందో మన అందరికీ తెలుసు. ఆసుది నాలు వెళ్ళిపోయినై. మళ్ళీరావు. ఈమధ్యనే కొందరు నాట్యకళాపోషకులు బయలుదేరి నటనావృత్తికి అస్పృశ్యతపోగొట్టారు. వీరు నాట్యకళకుగాని నటకులకుగాని సంఘానికిగాని ఎటువంటి ఉపకారమూ చెయ్యకపోగా బోలెడంత హానికలిగించారు. ఈ అపకారం చేసినందుకు ఆ నాట్యకళాపోషకులకు సంఘం పేరు ప్రఖ్యాతులిచ్చి గౌరవనీయులనుగా చేసింది. మొత్తంమీద వాళ్ళపని ఇవాళచాలా బాగుంది.

మానవతత్వం ఎటువంటిదంటే, మనిషి దాదాపు ఏ ఆచారానికైనా అలవాటుపడిపోతాడు. మనం చిన్నతనంనించీ చేస్తూ వస్తున్న పనులు ఎంత హాస్యాస్పదమైనవైనప్పటికీ మనకు వాటిల్లోఉన్న యేహ్యత మనకు కనిపించదు. ఎవడైనా చూడగలిగితే వాణ్ణి రివోల్యూషనరీ అనేస్తాం.

అయితే నటకులవిషయం ఒకటి చూడండి, పెద్దమనిషి, గౌరవనీయుడైనవాడు, మొహానికి రంగుమెత్తుకుని, నెత్తికి టోపా పెట్టుకుని, అసహజమైన దుస్తులుధరించి, ఏడవటమూ, నవ్వటమూ, కోపించటమూ, ప్రేమించటమూ మొదలైనవి చెయ్యటానికి ఒప్పుకుంటాడా? సిగ్గుపడడా? చాటుగా మన ఇంట్లోనూ, అందరూ చూచేటట్టు వీధిలోనూ చెయ్యటానికి సిగ్గుపడేపని నాటకరంగంమీద ఎందుకు చెయ్యాలి? నాటకం రంగం అనగానే సిగ్గు బిడియాలు వదిలివెయ్యవచ్చుననా? ప్రతి నటకుడూ చేస్తున్నపనేమిటి? కొందరు స్త్రీపాత్రలుకూడా ధరించి, చీరలుకట్టి, పూలుపెట్టుకుని కులకటంకూడా చేస్తున్నారే? ఇటువంటి ప్రవర్తనను సమర్థించటం ఎట్లా? సాటిమానవుణ్ణి తక్కువచేసి చూడటం నాకూ కష్టంగానేఉంది. అయితే ఉన్న పరిస్థితులు ఇవీ! దేశంలోఉన్న కళాపోషకులకుగాని విమర్శకులకుగాని ఈమాత్రం తట్టినట్టు కనపడదు. నాకు తట్టినందుకు నన్ను రివొల్యూషనరీ అని తిట్టకుండానూ ఉండదులోకం.

అయితే నాటకాలు ఆడవద్దనీ, నటించవద్దనీ నా అభిప్రాయంకాదు. ఎందుచేతనంటే, ఈదృష్టితో చూస్తే అన్నికళలూ అడుగంటవలిసే వస్తుంది. కథారచనకూడా అంతే. ఒక నాయకుణ్ణీ నాయకురాలినీ కల్పించి, వారిద్దరూ ఒకరనొకరు ప్రేమించుకున్నట్టూ, వారిద్దరూ కలిసి కష్టాలపాలయినట్టూ, చిట్టచివరకు కష్టాలన్నీ గట్టెక్కి అంతా సుఖంగాఉన్నట్టూ లేనిపోని అబద్ధాలు కల్పించి, సాక్షాత్తూ చూసినట్టే పరమగోప్యమైన విషయాలూ, హృదయాలలో ఉన్న రహస్యభావాలూ వివరంగా వర్ణించటం కూడా సరిఅయిన దృష్టితోచూసేవాడికి హాస్యాస్పదంగానే ఉంటుంది. అయితే మనమంతా అట్లా భావించకపోవటానికి కారణం, నేను మొదట చెప్పినట్టు, మనం ఈ నటనకు అలవాటుపడిపోవటమే.

ఈ లెక్కప్రకారం కళలన్నీ నశించిపోవాలని శాసించటంకూడా కుదరదు. కనక ఈ ప్రవర్తనను సమర్థించటానికి ఏదైనాఉందా అని ఆలోచించాలి. ఉన్నది, అది నిజమైన కళే! తన నాయికానాయకుల కష్టసుఖాలయందు చదువరికి ఆసక్తి కలగచేసే కథకుడు

లేనిపోని కథలు సృష్టించటానికి హక్కును పొందినవాడవుతాడు. అట్లాగే కళాదృష్టికల నటుడు తననటనయందు మనకు నమ్మకం (కన్విక్షన్) పుట్టించగలిగితే ఆనటుడు వేషధారణకు అర్హుడవుతాడు. అతడి కళాపటిమ యావత్తూ తనునటించుచున్న పాత్రయందూ, ఆపాత్రయొక్క సుఖదుఃఖాలయందూ ప్రేక్షకుడి హృదయం తగులుకునేటట్లు చెయ్యటంలో ఉంటుంది.

ఏతావాతా నేను స్పష్టీకరించదలుచుకున్న దేమంటే వేషధారణకు పూనుకున్నవాడు సరియయిన కళాజ్ఞానమూ కళను ప్రకటించేశక్తీ లేనివాడయినాడో, వెంటనే అతడు వట్టి సిగ్గుమాలినవాడుగానూ, ఆత్మగౌరవం లేనివాడుగానూ పరిణమించటం తప్ప గత్యంతరం లేదు. నటకులలో అంత పరిపూర్ణమైన ఆర్టిస్టులు ఎంతమంది ఉన్నారు? మిగిలినవారి సంగతి ఏమిటి? కళాపోషకులకు కళనుగురించి ఎంతవరకు జ్ఞానసంపత్తి ఉంది?

మన కళాపోషకులకు ప్రతి నటుణ్ణీ శ్లాఘించటం ఆచారం, పాపం, అజ్ఞానంవల్ల, అట్లా శ్లాఘించటమే కళాపోషకత్వానికి నిదర్శనమనుకుంటున్నారు వారు. వారట్లా ప్రవర్తించితేనేకాని లోకంకూడా వారిని కళాపోషకులుగా గణించదు. మనంచేసే పనులు మనకన్న అజ్ఞానులు ఆమోదించవలిసినగతి మనకు పట్టినప్పుడు మనం అధోగతిపాలుకాక ఏమవుతాం? ఇంతకన్న తారుమారు ఏముంటుందీ?

ఆత్మగౌరవం పోగొట్టుకోని నటుడు, నా అభిప్రాయంలో, ఏవేషంపడితే ఆవేషం వెయ్యడు, ఏనాటకంపడితే ఆనాటకం ఆడడు, ఆడవేషం వెయ్యడు, సంగీతంతో భావప్రకటక చెయ్యడు సంగీతంపాడినా! నాట్యకళను గురించి నా అభిప్రాయాలు తప్పయి ఉండవచ్చును. కాని కళాదృష్టికలవాడు తన ప్రవర్తనకు కొంతవరకు హద్దుపద్దులు పెట్టుకోవాలని మాత్రం అందరూ అంగీకరించితీరాలి.

నాటకరంగంమీదికి రావటమే ఎంతో ప్రమాదకరమైనపని అనుకుంటే, తెరమీదికి రావటం మరింత ప్రమాదకరం. ఎందుచేతనంటే నటకుడు తన మానాభిమానాలను అనేకమందిచేతుల్లో పెట్టినవాడవుతున్నాడు. సినారియో రాసేవాడు తను నటించే పాత్రను నిర్లక్ష్యంతో చిత్రించిఉండవచ్చును. డైరెక్టరు తనచేత ఏహ్యమైనపనులు చేయించవచ్చును. ఎడిటరు తను నటించినదాన్ని తన చిత్తంవచ్చినట్టు ఎడిట్ చెయ్యవచ్చును. టాకీలో వేషంవెయ్య బూనుకున్నవాడు ఈ ముగ్గురిలో ఎవరిప్రవర్తననూ అరికట్టలేడు. కాగితంమీద సంతకంచెయ్యకపూర్వం వారి మొహాలుకూడా అతనికి తెలియకపోవచ్చును డైరెక్టరూ, సీనారిస్టూ, ఎడిటరూ, వీరిముగ్గురూ అసమాన కళాజ్ఞానంకలవారయితేనేతప్ప ఆత్మగౌరవం కలవాడు తెరమీదికిరాడు.

కొందరు పేరుప్రఖ్యాతులుగల నటులు డబ్బుకోసమో పేరుప్రతిష్ఠలకోసమో చిత్రాలలో ఎక్కటానికి వప్పుకుని డైరెక్టరు వగయిరాలను అరికట్టి అదుపుచెయ్యచూడటం టాకీ పరిశ్రమకు హానికరం. అంత గొప్పనటులు డైరెక్టరు వగయిరాలమీద ఎంతో భక్తిశ్రద్ధలూ గురీ ఉంటేనేకాని చిత్రాల్లో నటించటానికి రారాదు. 'తారలు' పుచ్చుకునే దానిలో ఎన్నోవంతో గిట్టని డైరెక్టర్లూ తదితరులూ కల మన తెలుగుటాకీ పరిశ్రమ ఏస్థితిలో ఉన్నదో మనం సులభంగా ఊహించగలం.

టాకీలకు కావలిసిన నటులు రెండురకాలు — పాత్రధారులూ, నటకులూ. పాత్రధారులు నటకులు కానవసరంలేదు. కథకు కావలిసిన పాత్రలలో ఎక్కువభాగం పాత్రధారులకే

తగిఉంటై. ఆపాత్రలకు తగినవారినిగాచూసి కాస్టింగ్ డైరెక్టర్ వేషాలిస్తాడు. ఈపాత్ర ధారులు ఆపాత్రలకు ఆకారస్వరూపాలలో ఆ పాత్రలకు సహజంగా తగిఉంటారు. ఇక ఈ పాత్రధారులు చెయ్యవలిసిందేమంటే నవ్వమన్నప్పుడు వారికి సహజంగా చాతనయినట్టు నవ్వటమూ, ఏడవమన్నప్పుడు వారికి చాతనయినట్టు ఏడవటమూ. ఈపాత్రధారులు తమకు సహజంగా చాతకానిపని ఏదీ చెయ్యనక్కర్లేదు. హాలీవుడ్‌లో పెద్దపెద్ద జీతాలు పుచ్చుకుంటూ ఎంతో పేరుప్రఖ్యాతులు కల వారు చాలామంది కేవలమూ పాత్రధారులే కాని నటకులు కారు. ఇక నటకుడేమంటే, అతను తనసహజ ప్రకృతిని చంపుకుని మరొక మనిషి అయిపోవాలి. అయిపోయి తనూ తను నటించుతున్నపాత్రా ఒకటేనని మనల్ని నమ్మించాలి. వారిపాత్రలను సృష్టించేవారూ, వారిని డైరెక్టుచేసేవారూ అ పరబ్రహ్మలై ఉండాలి.

మన ఆంధ్రదేశంలో నటకులున్నారుకాని డైరెక్టర్లు వగయిరాలింకా లేరు. టాకీలు తీసే వారు కొన్ని సూత్రాలు తెలుసుకునేదాకా ఆడైరెక్టర్లు తయారుకారు. ఇప్పటిమట్టుకు జరుగుతున్నదేమంటే మంచినటకులను చెడు డైరెక్టర్లు చెడగొట్టుతూ ఉండటమే. ఆంధ్రుడికి ఏవిషయంలోనూ సూక్ష్మదృష్టి విచక్షణా లేదు. వాడుకభాషలో రాసే చెత్తయావత్తూ నవ్యసాహిత్యమే. అట్లాగే తెరమీద ఎక్కేవారంతా నటకులే, ఎక్కువ తక్కువలతో. అందువల్ల జరుగుతున్నదేమిటంటే వేషధారణకుకూడా పనికిరానివారు తారలైనారు. సామాన్య పాత్రధారులుకూడా ప్రేక్షక లోకానికి వారిమీద గల మోజునుబట్టి డబ్బూ పేరుప్రతిష్టలూ సంపాదించటం అసహజంకాదు. కాని ప్రొడ్యూసర్లు నటుల పేరు ప్రతిష్టలనుబట్టి నటకులే ధరించవలిసిన వేషాలను పేరు ప్రతిష్టలుగలవారికివ్వటం ఆంధ్రులకే సహజం.

—కొడవటిగంటి కుటుంబరావు.

'నవ్వులతీవ' బరంపురంవారి కడుపుబ్బనవ్వించు హాస్యగ్రంధములు.

వెలస్వల్పము! కొలదిప్రతులేగలవు!!

1 పెళ్లాన్ని ఎలాపిలవడం? తృతీయముద్రణం (తెలుసుకోదగినహంశాలు ఎన్నోవున్నాయి.)

2 అనుమానాలు ఆయన-ఆవిడ (నిజంగా చదివితీరవలసిందే)

3 ధ్రువ (పౌరాణికమేగాని విషయనిరూపణ చూడదగినది)

4 చింకిజోడు (జోడునూట్లాడ్డం బహు ఆశ్చర్యంగావుంటుంది.)

5 తాళంచెవితగాదా (ఒకఇంటి తాళంచెవి ముచ్చట. భార్యాభర్తల యందు తాళంచెవి తెచ్చిన గొప్పతగాదా.)

ఈ అయిదుగ్రంథములును 0-6-0 అణాల పోస్టుముద్రలు పంపువారికి పోస్టేజీ మేమేభరించి పుస్తకముల నందజేస్తాము. గ్రంథాలయములవారు 0-4-6 అణాల ముద్రలు పంపినచాలును. ఆలసించిన యీతరుణము దొరకదు.

వలయువారు :—

కాంచనపల్లి వేంకటరంగారావు, 'సంపాదకుడు' నవ్వులతీవ, బరంపురం (గంజాంజిల్లా.)